

మహతిలో జాతీయస్థాయి నాటక పోటీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగర పరిధిలోని మహతి కళాక్షేత్రం వేదికగా ఈనెల 18 నుండి 22వ తేదీ వరకు సుబ్బరాజు నాట్య కళా పరిషత్ 60వ వార్షికోత్సవ కలోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షులు కోనేటి సుబ్బరాజు తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుబ్బరాజు మాట్లాడుతూ జాతీయస్థాయిలో 38 సాంఘిక నాటికలు, 27 పద్య నాటకాలకు ఎంట్రీలు వచ్చాయన్నారు. ఇందులో 8 సాంఘిక నాటికలను, ఐదు పద్య నాటకాలను తుది పోటీలకు ఎంపిక చేసామన్నారు. తిరుపతి నగర ప్రజలు, కళాభిమానులు సుబ్బరాజు నాట్య కళా పరిషత్తు నిర్వహించే ఈ సాంఘిక నాటిక నాటకాలను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు

యాక్ట్ సెక్షన్ 30 నిరవధిక అమలుపై...

నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు

13న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం
'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' కార్యవర్గ నిర్ణయం

మీడియాతో నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఎల్‌వి సుబ్రమణ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాజ్యాంగబద్ధంగా పాలన కొనసాగినప్పుడే ప్రజలకు సుపరిపాలన అందుతుందని'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాసంఘాలపై నిర్బంధం విధిస్తూ యాక్ట్ సెక్షన్ 30 నిరవధిక అమలుపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ' కార్యవర్గం నిర్ణయించిందన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యవర్గ సమావేశం తిరుపతిలో శనివారం సంస్థ అధ్యక్షులు , ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి. భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. అనంతరం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ హింసకు తావులేకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ ఎన్నికలు జరుపుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ప్రతిపక్ష రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల కార్యకర్తలపై ఎటువంటి ఆధారాలు లేకుండా అక్రమ కేసులను బనాయించడంపై సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30ను నిరవధికంగా అమలు చేయడంపై, రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులపై, కార్యకర్తలపై పెడుతున్న పోలీసు కేసులలోని వాస్తవాలను తెలుసుకోవడానికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కోసం కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డీజీపీగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఎంవి. భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ పూర్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ అనగాని సత్య ప్రసాద్, హిందూ దినపత్రిక పూర్వ రెసిడెంట్ ఎడిటర్ వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కమిటీ రాష్ట్రంలో పర్యటించి విభిన్న వర్గాల వారితో సంప్రదింపులు జరిపి కేసు మోపబడిన వారి వద్ద నుండి వాస్తవాలను సేకరిస్తుందన్నారు. ఈ నెల 13న విజయవాడలో త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించామన్నారు. బాధిత పక్షాలు, బాధితులు వారి అభిప్రాయాలను త్రిసభ్య కమిటీ దష్టికి స్వతంత్రంగా తీసుకురావచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయకార్యదర్శి వి.లక్ష్మణరెడ్డి, కోశాధికారి ఇ.ఫల్గుణ కుమార్ , పూర్వ డిజిపి ఎం.వి. కృష్ణారావు పాల్గొన్నారు.

ఎప్పటికందేనో...పరిహారం

తుపాను బాధితుల నిరీక్షణ

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

మిచౌంగ్ తుపాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో తూర్పు మండలాల్లో అధికభాగం నీటమునిగాయి. పంటపొలాలు, ఇళ్ల, రహదారులు, వంతెనలు అన్నీ నీటితో నిండిపోయాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది మంది బాధితులకు సాయం కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. అయినా అధికారులు ఇప్పటి వరకూ కనీసం వరదనష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసిన పాపాన పోలేదు. ఇక నష్టపరిహారం ఎప్పటికి అందుతుందోనని బాధితులు ఆవేదన చెందుతున్నారు. సాక్షాత్తు సిఎం పర్యటించే నాటికి పూర్తిస్థాయి నష్టం అంచనాలు ప్రకటించకపోవడం గమనార్హం.

జిల్లాల విభజనతో తిరుపతి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. గతంలో లేనిది ఈ జిల్లాకు సముద్ర తీరప్రాంతం కలిసొచ్చింది. నాలుగు రోజుల పాటు మించెన్ తుఫాన్ వల్ల జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. జిల్లాలోని తూర్పు మండలాలైన శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, తిరుపతి డివిజన్లలో వర్షం వల్ల నష్టం తీవ్రంగా ఉంది. తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం, అధికారులు అప్రమత్తం అయ్యారు. హెల్ప్‌లైన్లు, సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు. కానీ వర్షం ఆగిన తర్వాత బాధితులను ఆదుకోవడంలో పూర్తిస్థాయిలో చొరవ చూపలేదు. కనీసం ఇప్పటి వరకు వరద నష్టాన్ని అధికారులు అంచనా వేయకపోవడం శోచనీయం. ప్రాథమిక అంచనాలు కూడా లేకపోవడంతో బాధితులకు పరిహారం ఇవ్వడంలో అలసత్వం తప్పలేదు. సాక్షాత్తు సిఎం జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చి, వరద ప్రాంతాలను పర్యటించి, కొంత మంది బాధితులతో ముచ్చటించినా, పరిహారం ఇస్తాం, నష్టనివారణను పూడ్చుతాం. నిధులు విడుదల చేస్తాం అంటూ హామీలు ఇవ్వడం తప్పా, పరిహారం ఇచ్చిన పాపాన పోలేదు. తిరుపతి జిల్లాలో ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పశుసంవర్ధక, మత్స్యశాఖల పరిధిలోనే సుమారు 600 కోట్ల రూపాయలు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ స్కీమ్‌లు, పిడబ్ల్యుఎస్ స్కీములు, ట్యాంకర్లు, 15 జనరేటర్లు, మరో 72 బోర్లు నీట మునిగాయి. వ్యవసాయశాఖకు సంబంధించి 34 మండలాల్లో 467 గ్రామాల్లో పంట నష్టం, 12568 హెక్టార్లో వరి, 460 హెక్టార్లో వేరుసెనగ, 987 హెక్టార్లలో కంది, ఉద్యానశాఖ పరిధిలో 250 హెక్టార్ల పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖలో జిల్లాలో 8 కోట్ల మేర నష్టం జరిగింది. చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంటపొల్లాల్లో ఇసుకమేటలు, అనేక వేల ఎకరాలు పంట నీటమునిగింది. అనేక కల్వర్లు, చెక్‌డ్యాములు, కొట్టుకుపోయాయి. వేలాది మంది బాధితులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో వరద నష్టాన్ని అంచనా వేసి, త్వరతగతిన పరిహారాన్ని అందించి, తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. ఆ దశగా అధికారులు చర్యలను ముమ్మరం చేయాల్సి ఉంది.

రైతులను ఆదుకోవాలి: మాజీ ఎంఎల్ఎ హేమలత

ప్రజాశక్తి -కెవిబిపురం

మిచౌంగ్ తుపాను కారణంగా కెవిబి పురం మండలంలో ఒళ్లురు గ్రామంలో వర్షానికి గోడలు పడిపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయంగా 5వేల రూపాయలను బాధిత కుటుంబాలకు అందజేశారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి అనంతరం వ్యవసాయ అధికారితో, కరెంట్ అధికారితో, రోడ్లుకు సంబంధించిన పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో మాట్లాడి జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలన్నారు. అదేవిధంగా అంజూరు నుంచి జయలక్ష్మిపురానికి బ్రిడ్జి నిర్మాణం చేయాలని, అంగేరిచెరువు రోడ్డు తక్షణమే స్పందించి రోడ్డు వేసి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మునస్వామి యాదవ్, ఒళ్లురు సర్పంచ్ సురేష్, లోకి ముని కష్ణయ్య పాల్గొన్నారు

మడిబాకలో పొలాలు పరిశీలించిన సిపిఎం

ప్రజాశక్తి- ఏర్పేడు

సిపిఎం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బందం తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతు పొలాలను మడిబాక ప్రాంతంలో శనివారం పరిశీలించారు. ఎకరాకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు. లేనిచో త్వరలోనే జిల్లా కలెక్టరేట్‌ను బాధిత రైతులతో ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. పొలాలను పరిశీలించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పి.హేమలత, జిల్లా నాయకులు భాస్కర్‌నాయుడు, అశోక్, చంగల్‌రాయులు ఉన్నారు.

12 నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె : సిఐటియు

ప్రజాశక్తి - వెంకటగిరి

ఈనెల 12 నుంచి జరిగే అంగన్‌వాడీల నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ సమ్మె ద్వారా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలను గద్దె దించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తెలంగాణా కంటే అదనంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతానని చెప్పిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చినాలుగున్నరేళ్లు దాటినా వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి నిరసిస్తూ సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు అదే బాటలో ఉన్నారన్నారు. సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ బంగారుపట ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసు వద్ద అంగన్‌వాడీల సమ్మె జరుగుతుందన్నారు. వేతనాలు పెంచేంతవరకు సమ్మె జరుగుతుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. 2017 నుండి పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించాలని అన్నారు. సిఐటియు నాయకులు ఎం స్వరూప రాణి, ప్రసాద్, సుబ్బయ్య, పద్మ, సుభాషిని, శుభ రత్నమ్మ, పెంచలయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో వాలంటీర్ మృతి

ప్రజాశక్తి- కేవిబి పురం

మండలంలోని సదాశివపురం గ్రామ పంచాయతీకి చెందిన వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వాలంటీర్ బత్తల రవి కుమార్(32) శనివారం హఠాత్తుగా గుండె పోటు రావడంతో ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ రవి కుమార్ వాలంటీర్ ప్రజలకు, సచివాలయానికి మధ్య వారధిగా పనిచేశారని అన్నారు. సిఐటియు మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు మాట్లాడుతూ రవికుమార్ పేద కుటుంబానికి చెందిన వాడని, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

'టిడిఆర్ బాండ్లపై అసత్యపు ఆరోపణలు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ఆనం వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా తిరుపతికి చెందిన ప్రజాప్రతినిధులపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల దష్టిని మరల్చడానికి ప్రయత్నం చేస్తున్నారని తిరుపతి జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు ఆరే అజయ్ కుమార్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో అజయ్ కుమార్ మాట్లాడుతూ టిడిఆర్ బాండ్ల విషయంలో కుంభకోణం జరిగిందని, నాలుగు వేల కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించడం నమ్మశక్యమేనా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు తిరుపతిలో జరిగిన మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణకు సంబంధించి భూభాగాన్ని కోల్పోయిన బాధితులకు సుమారు 400కు పైగా టిడిఆర్ బాండ్లను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగిందన్నారు. అయితే టీడీఆర్ బాండ్లపై ఎటువంటి నగదు పరిహారం అనేది సంఖ్య రూపంలో ముద్రించ బడదని, ఏ ప్రకారం నాలుగు వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందో ఆనం వెంకటరమణారెడ్డి నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డారెడ్డి మురళి, కిషోర్, సురేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న సదా భార్గవి

స్విమ్స్‌నందు నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ భవన సముదాయాలను టిటిడి జెఇఒ సదా భార్గవి శనివారం పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎంబిబిఎస్ విద్యను అభ్యసించే మహిళా విద్యార్థినుల సౌకర్యార్థం నిర్మితమవుతున్న ఐదంతస్తుల అదనపు గదుల హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామలో మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవ విభాగం, బిఎస్ అండ్ హేచ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎస్వీయూ మానవ హక్కుల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రవిబాబు హాజరై మానవ హక్కుల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మనిషి స్వేచ్ఛగా బతకాల్సి ఉన్నా కొన్ని పరిస్థితుల కారణంగా ఆ స్వేచ్ఛను కోల్పోతున్నాడన్నారు. సమాజంలో కుల మతాలకతీతంగా అందరూ ఒకే రకమైన స్వేచ్ఛ హక్కులను కలిగి ఉన్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మంచి నడవడికను అలవర్చుకొని, దేశభక్తి స్ఫూర్తితో లక్ష్యసాధన కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, జాతీయ సేవా విభాగం ఆఫీసర్ ఎస్. చక్రిశ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నందు ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న శ్రీశ్రీ కళావేదిక పోస్టర్ను టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, కొల్లి రమావతి పర్యవేక్షణలో సంయుక్తంగా కలిసి నిర్వహిస్తున్న కవులు, రచయితలు , జానపద కళారూపాల నిర్విరామ కార్యక్రమం ఈ నెల 16, 17 తేదీల్లో 30 గంటల 30 నిమిషాల 30 సెకనులు ప్రపంచ రికార్డు సాహితీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కేసులతో మనశ్శాంతి కోల్పోవద్దు : జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు టౌన్ : ఎంతో నగదు, ఆస్తులున్నా మనశ్శాంతి లేనిదే వథా అని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. పుత్తూరు కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ శనివారం సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులు ఉంటే మనశ్శాంతి ఉండదని, ఎప్పుడు కేసులు పరిష్కారం జరుగుతుందా అని టెన్షన్ పడేకంటే, ఒకరినొకరు అర్థం చేసుకుని రాజీ చేసుకుంటే ఎలాంటి సమస్యలు తలెత్తవని తెలిపారు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ ప్రధాన జడ్జి జానకి, అదనపు జూనియర్స్ సివిల్ జడ్జి వి గోపాలకష్ణ, న్యాయవాదులు సంజీవి, మురుగేషన్ రెడ్డి, కే పురుషోత్తం, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

470 కేసులకు పరిష్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కోర్టు పరిధిలో పెండింగ్లో ఉన్న 470 కేసులకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా సత్వర పరిష్కారం లభించింది. స్థానిక శ్రీకాళహస్తి కోర్టులో శనివారం జాతీయ లోక్ అధాలత్ నిర్వహించారు. 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కష్ణప్రియ సమక్షంలో క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ ప్రమాద పరిహార కేసులు, లేబర్, సివిల్ కేసులకు సంబంధించి 470 కేసులను పరిష్కరించారు. తద్వారా రూ.98 లక్షలు రికవరీ చేశారు. అంతకముందు రక్తదాన శిబిరాన్ని న్యాయమూర్తులు ప్రారంభించారు. పలు శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

మామిడిలో మంచి పూత కోసం...

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

అక్టోబర్, నవంబర్‌లో బెట్ట పరిస్థితి, డిసెంబర్‌లో తుపాను నేపథ్యంలో మామిడి పూత బాగా రావడానికి రైతులు తగిన చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ జిల్లా ఏడి మెరుగు భాస్కరయ్య పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన తరువాత రైతులు తేలికగా దున్నుకోవడం ద్వారా కలుపు నివారించవచ్చున్నారు. దున్నిన తర్వాత, చెట్లకు పొటాషియం నైట్రేటు, అర్కా మ్యాంగో స్పెషల్ (లీటరు నీటికి 5 గ్రా) లేదా ఫార్ములా-4 సూక్ష్మ పోషకాలు మిశ్రమాన్ని (లీటరు నీటికి 3 గ్రా.) కలిపి స్ప్రే చేయాలని సూచించారు. డిసెంబర్ మూడో వారంలో తేనెమంచు పురుగుల నివారణకు అసిపేటు లేదా క్లోరిపైపాస్, అజాడిరిక్టిన్ కలిపి స్ప్రే చేయాలన్నారు. పూత పూర్తిగా విడిగిన దశలో ఎలాంటి మందులను స్ప్రే చేయరాదని సూచించారు. మామిడిలో పూత తర్వాత పిందె కట్టే సమయంలో అవకాశం ఉన్నచోట్ల చెట్లకు నీరు పెట్టాలి. దీనివలన పూత-పిందె రాలడం తగ్గి, పిందెలు మంచి సైజుకు పెరుగుతాయి. పిందెలు ఏర్పడే దశ నుండి 15 రోజుల వ్యవధిలో 2 నుండి 4 సార్లు చెట్లకు నీటి తడులు ఇవ్వడం వలన మంచి ఫలితాలు వస్తాయని సూచించారు.

వేడుకగా శ్రీసిటీ ఎమ్‌డి కుమార్తె రిసెప్షన్

హాజరైన రాజకీయ, పారిశ్రామిక ప్రముఖులు

ప్రజాశక్తి - వరదయ్యపాళెం

శ్రీసిటి ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కుమార్తె వివాహం, రిసెప్షన్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం రాత్రి చెన్నైలో జరిగిన వివాహ వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్, మంత్రి రోజా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమూరి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్‌లు వైవి సుబ్బారెడ్డి, కనుమూరి బాపిరాజు, శ్వేతా మాజీ చైర్మన్ భూమన్, మాజీ ఎంపీలు చింతామోహన్, కెవిపి రామచంద్రరావు, సిపిఐ నాయకులు నారాయణ, సినీ దర్శకులు రాఘవేంద్రరావు, సినీ నటి మంజు భార్గవి పాల్గొని నూతన వధూవరులు నిరీష, సాగర్ పంకజ్‌లను ఆశీర్వదించారు. శుక్రవారం రాత్రి సూళ్లూరుపేటలో రిసెప్షన్ జరిగింది. మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆదిమూలం (సత్యవేడు), సంజీవయ్య (సూళూరుపేట), మధుసూదనరెడ్డి (శ్రీకాళహస్తి), వరప్రసాద్ (గూడూరు), మేకపాటి విక్రమ్ రెడ్డి (ఆత్మకూరు), కోరుముట్ల శ్రీనివాసులు (కోడూరు), సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఎస్వీబీసీ చైర్మన్ డా.సాయికష్ణ యాచేంద్ర హాజరయ్యారు.

శ్రీసిటీ ఎమ్‌డి రవీంద్ర సన్నారెడ్డి కుమార్తె వివాహ వేడుక

మీడియాతో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారా?: చింతా మోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్వో, తహశీల్దార్ కార్యాలయాల్లో ఉండాల్సిన ఓటర్ల జాబితాను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎందుకు ఉంచారని, దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారా అంటూ మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అనుమానాలు కలుగుతున్నాయని, తిరుపతిలో ఎక్కడా చోటు లేనట్టు పాపానాయుడు పేట వద్ద ఈవీఎంలను ఉంచడం సరికాదన్నారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలతో ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రభావం ఉండబోతుందని చెప్పారు. తాను పెట్రో కెమికల్ మంత్రిగా పనిచేశానని, పాలిమర్స్ లాంటి సంస్థలను శ్రీ సిటీకి తీసుకురావడం దారుణం అన్నారు. పాలిమర్స్ బాధితులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఉన్నారని గుర్తు చేశారు. ఇటువంటి సంస్థల వల్ల విషవాయువులు బయటికి వస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, సంస్థ తరలింపుపై పునరాలోచించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, తేజోవతి, జావేద్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసపోయిన లక్ష్మికి న్యాయం చేయాలి: ఐద్వా

లక్ష్మిని పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: మంగళంపేటకు చెందిన లక్ష్మిని ప్రేమ పేరుతో మోసగించి, ఆమె ఆత్మహత్యా యత్నానికి పాల్పడానికి ప్రేరేపించిన చిన్నరెడ్డి నాయక్ తక్షణం అరెస్టు చేసి, ఆమెకు న్యాయం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాసుపల్లి జయంతి శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. లక్ష్మిని చిన్నరెడ్డి నాయక్ ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి తిరుపతి శివజ్యోతి నగర్ లో ఒక రూమ్ అద్దెకి తీసుకొని సహజీవనం చేస్తూ అమర్ రాజా సంస్థలో పనిచేస్తూ సంవత్సరకాలంగా జీవిస్తున్నారు. ఇప్పుడు లక్ష్మి గర్భం దాల్చడంతో చిన్నరెడ్డి నాయక్ ను పెళ్లి చేసుకోవాలని అడగడంతో చిన్నరెడ్డి 'నీ ప్రవర్తన మంచిది కాదు..' నిరాకరించడంతోపాటు నిర్ధాక్షిణ్యంగా కొట్టి ఇంటి నుండి బయటకు తరిమి వేశాడని, ఏమి చేయలేని స్థితిలో లక్ష్మి ఆత్మహత్యకు ప్రయత్నించగా తిరుపతి రుయా హాస్పిటల్‌లో చావు బతుకుల మధ్యలో లక్ష్మీ ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, మహిళా సంఘం నాయకురాలు అమ్మాజీ, లక్ష్మీని పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్య అందించాలని, ప్రభుత్వం తక్షణ స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యతగా శ్రీవారి లడ్డూ తయారీ

పోటు సిబ్బందితో ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి -తిరుమల: నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావు లేకుండా నాణ్యతగా శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాలు తయారు చేస్తున్నామని తిరుమల శ్రీవారి ఆలయ పోటులో పనిచేస్తున్న శ్రీ వైష్ణవ బ్రాహ్మణులు స్పష్టం చేశారు. ఇటీవల డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో లడ్డూ నాణ్యతకు సంబంధించి పలువురు భక్తులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని టీటీడీ అధికారులు పోటు సిబ్బందితో తిరుమల వైభవోత్సవ మండపంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటులో పనిచేస్తున్న పలువురు శ్రీ వైష్ణవ బ్రాహ్మణులు మాట్లాడుతూ తాము కొన్ని తరాలుగా పారంపర్యంగా లడ్డూ తయారీలో నైపుణ్యం సాధించామని చెప్పారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి, శనగపిండి, చక్కెర ఎండు ద్రాక్ష, బాదం తదితర అన్ని దినుసులను దిట్టం ప్రకారం టీటీడీ అధికారులు అందిస్తున్నారని, వీటిని వినియోగించి నాణ్యంగా లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నామని వివరించారు. ఈ మేరకు లడ్డూ నాణ్యత తగ్గే అవకాశం లేదని చెప్పారు. ఈ సమావేశంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ శ్రీహరి, పోటు పేష్కార్ శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలకు అటానమస్ హోదా

- పదేళ్ల పాటు కల్పించిన యుజిసి
- అధికారులు, అధ్యాపక బృందానికి టీటీడీ ఛైర్మన్, ఈవో అభినందనలు

పజాశక్తి - క్యాంపస్ : టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 10 సంవత్సరాల పాటు అటానమస్(స్వయంప్రతిపత్తి) హోదా మంజూరు చేసింది. తద్వారా కళాశాల అభివృద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుంది. విద్యావిధానం, పరీక్షల నిర్వహణ, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్ లో మార్పులు చేసుకోవడానికి వీలవుతుంది. దీంతోపాటు సామాజిక సేవా దృక్పథంతో విద్యా బోధన, ఆధునిక సాంకేతికత ఆధారంగా కోర్సుల నిర్వహణ, మెమరీ బేస్డ్ విద్యావిధానం ఏర్పాటుకు వెసులుబాటు కలుగుతుంది. ప్రాంగణ ఎంపికలకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకు వస్తాయి.

1945లో కళాశాల ఏర్పాటు

రాయలసీమ జిల్లాలకు చెందిన నిరుపేద పిల్లల విద్యా అవసరాలను తీర్చడానికి తిరుపతిలో కళాశాల ఏర్పాటు చేయాలని అప్పటి టీటీడీ బోర్డు ఛైర్మన్ దివాన్ బహద్దూర్ వి.రఘునాథరెడ్డి 1943 ఆగస్టులో ప్రతిపాదించారు. ఈ మేరకు 1945లో 80 మంది విద్యార్థులతో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రారంభమైంది. ప్రస్తుతం 2,735 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2022 సెప్టెంబర్ 13న కళాశాల న్యాక్ ఎ ప్లస్ గుర్తింపు పొందింది. క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ , ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ , ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ తో సహా వివిధ రంగాలలో కళాశాల ఐఎస్‌వో ధృవీకరణ పొందింది.

కళాశాలలో ఆర్మీ వింగ్, ఎయిర్ వింగ్, ఆర్ అండ్ రెజిమెంట్, రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఒక ప్రత్యేక ప్లేస్‌మెంట్ సెల్, పోటీ పరీక్షల సెల్, యాక్టివ్ అకడమిక్ కౌన్సిల్, సైన్స్ క్లబ్, ఎన్‌సిసి వింగ్ ఉన్నాయి. అంబేద్కర్ రీజినల్ స్టడీ సెంటర్, ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ఉన్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హాస్టల్ బ్లాక్ ను ప్రారంభించారు.

ఛైర్మన్, ఈవో అభినందన

టీటీడీకి చెందిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు అటానమస్ హోదా లభించడానికి కృషి చేసిన టీటీడీ జేఈవో సదా భార్గవి, విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ, కళాశాల అధ్యాపక బృందాన్ని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

మిరపకు అపార నష్టం

ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మిచౌంగ్ తుపాను కారణంగా మండలంలో మిరప రైతులు పూర్తిగా నష్టపోయారు. అందులో ఎక్కువ శాతం దళితులు కావడం గమనార్హం. మండలంలోని కుక్కంభాకం, కనుమ నంబెడు మతకముడి, ఉగ్గుమూడి పలు గ్రామాలలో మిరప పంట పూర్తిగా నష్టపోయింది. ఇందులో ఎక్కువ శాతం దళితులు ఉండడం గమనార్హం. ఒక్కో రైతుకు మిరప సాగులో ఒక ఎకరాకు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. దీన్ని మండల స్థాయి అగ్రికల్చర్ అధికారులు పరిశీలించి పై అధి కారులకు విన్నవించాలని దళితులకు తగు న్యాయం చేయాలని బాధితు లు వాపోతున్నారు. ఈ సందర్భంలో కుక్కం భాగం రైతులు కారని సత్యం కార్యని గోవిందయ్య మాట్లాడుతూ మిరప నారు ఒక మొలక ఒక్క రూపాయికి కొనుగోలు చేసి మిరప సాగు చేశా మమన్నారు. దురదృష్టవశాత్తు ఈ తుపాను ముంచుకు రావడం దళిత రైతులైన తమకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు పైగా నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి అధికారులు ఈ విషయం వివరించి న్యాయం చేయాలని మిరప సాగు రైతులు మండల స్థాయి అధికారులను వేడుకుంటున్నారు. వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని ప్రభుత్వం ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని దళిత రైతులు కోరుతున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం వుంది.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృ త్వ అభియాన్ లో భాగంగా గర్భిణులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వ హించారు. గర్భిణు లకు రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు నిర్వహించి వారిలో రక్తహీనత వున్న వారికి మాత్రలు పంపిణీ చేశారు. ఎక్కువ రక్తహీనత ఉన్నవారికి సుక్రోజ్ ఇంజక్షన్లు అందించారు. ధనుర్వాతం టీకాలు అందించారు. అంగన వాడీ కేంద్రంలో ఇచ్చే బలవర్ధక ఆహారం తప్పనిసరిగా తీసుకో వాలన్నారు. పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా వచ్చి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోనీ గాంధీ నగర్ ప్రాంతంలో టిడ్కో గృహాలకు ట్యాంకర్‌ల ద్వారా గూడూరు మున్సిపల్ అధికారులు నీటిని సరఫరా చేశారు. టిడ్కో గృహాల్లో తాగు నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని స్థానికులు తెలిపారు. ఆయన పురపాలక అధికారులలో మాట్లాడి ట్యాంకర్‌ల ద్వారా నీటిని పంపారని స్పందించిన ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదినం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను తిరుపతి జిల్లా ఎస్‌సి విభాగ అధ్యక్షులు శివశంకర్, పిసిసి ప్రధాన కార్యదర్శి గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో జీవకోనలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ దేశానికి సోనియా గాంధీ అవసరం ఉందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం మళ్లీ దేశంలో గాడి తప్పిన పాలనను పునరుద్ధరించడానికి నడుం బిగించిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, త్వరలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చెపడుతుందన్నారు.

సోనియా గాంధీ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నాగభార్గవి

ప్రజాశక్తి-రేణిగుంట: కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని నాగ భార్గవి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. పుష్పలత తెలిపారు. నవంబర్ 16న చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 14 హాకీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మదనపల్లి బిటిఆర్ కళాశాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో నాగభార్గవి పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన నాగ భార్గవిని పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

వారం రోజులుగా తాగునీరు లేదు!

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మండలం గొట్టిప్రోలు గ్రామ ప్రజలు వారం రోజులుగా తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో గొట్టిప్రోలు పంచాయతీలో అనేక చోట్ల కరెంటు స్తంభాలు పడిపోవడంతో పాటు విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి మోటార్లు సైతం నీటిలో మునిగిపోయాయి. ఈ కారణంగా తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. వీలైనంత త్వరగా మోటర్లు మరమ్మతులు చేయించి తాగునీరు అంది స్తామని సర్పంచ్ పరసా వెంకటరమణయ్య తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులతో తమ గ్రామంలో వెంటనే మరమ్మతులు చేపట్టి గ్రామం లో విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

తొట్టంబేడు: తుపాను బాధిత రైతులను ఆదుకోవాలని సంఘ సేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. తొట్టంబేడు మండల పరిధిలో 15 గ్రామాల్లో 525 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయన్నారు. మండలంలోని కాసరం, రాంబట్లపల్లె, పూడి, పొయ్య, పెద్దకన్నలి, పెద్దకనపర్తి, బోనుపల్లె, కొత్త కండ్రిగ, కొణతనేరి, తంగేళ్లపాళెం, సాంబయ్య పాళెం తదితర గ్రామాల్లో పెద్ద మొత్తంలో వరి పంట దెబ్బతిందని కొన్ని గ్రామాల్లో పంట కోతకు వచ్చే దశలో పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయా రన్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయి లో క్షుణ్ణంగా పరిశీలించి పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని ఆయన కోరారు. ఉపాధి హామీ ఏపీవో సుజాత రైతులు టార్పాల్ పట్టలు అందచేస్తామని హామీ ఇచ్చారన్నారు. రైతులు తమ పంట నష్టం వివరాలను అధికారు లకు తెలపాలని భరత్ రెడ్డి కోరారు.

వెంకటగిరి : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని 12వ వార్డు సచివాలయ పరిధిలో ముంపు ప్రాంతాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ కమిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఆ వార్డులోని సవారీ గుంట ఇళ్ల మధ్యలో ఉన్న వర్షపు నీళ్ల వల్ల ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి మున్సిపల్ సిబ్బంది త్వరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో కౌన్సిలర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోట : తుపానుతో కర్లపూడి గ్రామంలోని సొనమాల దిబ్బ గిరిజన కాలనీ, పలు గిరిజన కాలనీలు,దళితవాడ లో మొత్తం ఉధృతంగా వరదనీరు చేరి ఊరే పెద్ద చెరువులా మారినా ఇటువైపు అధికారులెవ్వరూ కన్నెత్తి చూడక పోవడం గ్రామస్తులు అందరికి ఆశ్చర్యకరంగా మారింది. ఈ సమయంలో ఆ గ్రామస్తును సన్నారెడ్డి చెంచురాఘవ రెడ్డి భోజనాలు అందించారు. పలువురు గిరిజన కుటుంబాలకు తాను అండగా వున్నానని వారిలో మనోధైర్యాన్ని నింపారు. ఆ గ్రామాన్ని వరద నీటి నుండి రక్షించాలని కోరారు.

వైసీపీకి మీలాంటి నాయకులు ఉండడం సంతోషం

సంపత్ కుమార్‌కు సిఎం ప్రశంస

ప్రజాశక్తి -కోట : 'వైసిపికి మీలాంటి నాయకులు ఉండడం సంతోషదాయకం' అని తుపాను పర్యటన సందర్భంగా వచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి కోట వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డిని ప్రశంసించారు. శనివారం వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యానగర్ హెలిప్యాడ్ వద్ద సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిశామన్నారు. సీఎంని కలిసిన ఆ సమయంలో రానున్న ఎన్నికలకు వైసిపి బలోపేతనానికి బాగా కష్టపడి పని చేయాలని తెలిపారని చెప్పారు.

ట్యాంకర్‌లతో తాగు నీటి సౌకర్యం

ప్రజాశక్తి–కోట : మిచాంగ్ తుపాను కారణంగా గత నాలుగు రోజుల నుండి తాగునీరు లేక అవస్థలు పడుతున్న కోట పట్టణం లోని నార్త్ గిరిజన కాలనీ వాసులకు శుక్రవారం ఉదయం గూడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ పాశిం. సునీల్ కుమార్ ఆదేశాల మేరకు కోట పట్టణంలోని తిరుపతి పార్లమెంట్ మైనారిటీ విభాగ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో కోట ఎంపిటిసి లు శంషాద్దిన్, దారా సురేష్, నియోజకవర్గ మైనారిటీ విభాగ ఉపాధ్యక్షులు షేక్.నౌషాద్ , తల్లం.శ్రీనివాసులు తదితరుల సారధ్యంలో ట్యాంకర్ లతో నీటి ని సరఫరా చేశారు.

క్రీడల్లో ఆసక్తి పెంపొందించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-నాయుడుపేట: క్రీడల్లో ఆసక్తిని పెంపొందించేందుకే ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నాయుడుపేట మున్సిపాలిటీ 24 వార్డు కౌన్సిలర్ దారా రవిబాబు అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో మునిసిపల్ ఛైర్పర్సన్ కటకం దీపిక ఆధ్వర్యంలో సన్నాహక కార్యక్రమంను ప్రారంభించారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం అడ్మిన్‌లతో నిర్వహించిన ఈ సమావేశంలో ధారా రవి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థు లు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. అందరూ పేర్లు నమోదు కోవాలన్నారు. అందుకు సంబంధించిన ఆట వస్తువులు, సామగ్రి ఇప్పటికే సబంధిత సచివాలయాలకు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, నాయుడుపేట ఎస్సీ సెల్ అధ్యక్షుడు కటకం జయరామయ్య, రెండో వార్డ్ కౌన్సిలర్ పాలేటి నాగార్జున, చదలవాడ కుమార్ పాల్గొన్నారు.

టిటిడిని రాజకీయవేదికగా మార్చొద్దు..

బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: 'టిటిడిని రాజకీయ వేదికగా మార్చొద్దు' అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ కోరారు. శనివారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి అలిపిరి కూడలి వద్ద చేతులెత్తి మొక్కుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తిరుమలలో అన్నప్రసాదం, స్వామి దర్శనం పట్ల,సిబ్బంది తీరును లోటుపాట్లను సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ప్రసారం చేస్తున్న కొంతమంది రాజకీయ పార్టీల,నాయకుల తీరు శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఎక్కడైనా సంస్థల లో చిన్న చిన్న పొరపాట్లు ఉండటం సహజం,దానిని నివృత్తి మార్గాలను వెతకలేగాని,సోషల్ మీడియా ను వేదికగా చేసుకొని దుష్ప్రచారం చేయడం తగద న్నారు. ఫిర్యాదులపై అధికారులు స్పందించక పోతే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పవిత్రమైన తిరుమల కొండపై ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయకుండా,సోషల్ మీడియా ద్వారా తితిదే గురించి దుష్ప్రచారం చేయకుండా కొత్త చట్టాన్ని తీసుకు రావాలని కోరారు.

12 నుంచి సాంస్కృతిక సమ్మేళనం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసా య విశ్వవిద్యాలయ రెండో విడత అంతర కళాశాలల క్రీడలు, ఆటలు, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం- 2023-24 ను తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల వేదికగా నిర్వహిం చడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈనెల 12 నుంచి15వతేదీ వరకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వ ర వ్యవసాయ కళాశాలలో జరిగే ఈ సమ్మేళనానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ, వ్యవసా య ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన 678 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్స్ డాక్టర్ పి సాంబశివరావు అధ్యక్షతన జరిగే ఈ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య సమ్మేళనం ప్రారంభోత్సవ సమావేశానికి ముఖ్య అతిథిగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డి. భారతి, గౌరవ అతిథిగా డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి కరుణాసాగర్, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి రమణ హాజరవుతారని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకరరావు పేర్కొన్నారు.

వరద ప్రాంతాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ సేవలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలోని కొన్ని ప్రాంతాలలో విధ్వంసం సృష్టిం చిన మిగ్‌జాం తుపాను వరద ప్రభావిత ప్రాంతాల్లోని రాయల్ ఎన్ఫీల్డ్ వినియోగదారులకు తమ సేవలు అందిస్తున్నట్లు ఆ సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ఎడ్వందర్ సింగ్ గులేరియా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలి తుపాను ప్రభావాన్ని తాము అర్థం చేసుకున్నాము. ఈ కష్టకాలంలో మా వినియోగదారులకు అండగా నిలుస్తాం.. రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌లు వినియోగదారులకు అండగా నిలవాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్, సర్వీస్, ఇన్సూరెన్స్ ప్రాసెసింగ్‌లో వినియోగదారులకు రికవరీ ప్రక్రియను వీలైనంత మృదువుగా చేయాలని సూచించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ అందించిన సమగ్ర వాహన తనిఖీ, సేవా మద్దతును సద్వినియోగం చేసుకునేందుకు అంకితమైన టోల్-ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని బాధిత వినియోగదారులకు తెలిపారు. ఇంజిన్ పనిచేయకపోవడం, దెబ్బతినకుండా ఉండేందుకు వరదతో ప్రభావితం అయిన మోటార్‌సైకిల్ ఇంజిన్‌ను స్టార్ట్ చేయకూడదన్నారు. వ్యక్తిగత, వాహన భద్రత గురించి, దాని వినియోగదారులకు ఎస్ఎంఎస్ ప్రచారాలు, బల్క్ ఇమెయిల్‌ల ద్వారా అవగాహన కల్పిస్తుందన్నారు. మరింత సమాచారం కోసం రాయల్ ఎన్‌ఫీల్డు డాట్ కామ్‌ను సంప్రదించాలని కోరారు.

పాలకుల నిర్లక్ష్యం..ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పాలకుల నిర్లక్ష్యం కారణంగా మంగళం పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిటీఆర్ కాలనీ నుండి తిరుమల నగర్ ప్రధాన మార్గాన్ని కలుపుతూ ఇటీవలే నిర్మించిన సిసి రోడ్డుకు కల్వర్టు నిర్మించక పోవడంతో ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో కల్వర్టు నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న గుత్తేదారుడు ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. దీనిపై 'ప్రజాశక్తి' సంబంధిత ఏఇని వివరణ కోరుతున్నా అధికారి 'అదిగో చేద్దాం...ఇదిగో ప్రారంభిస్తాం...!'అంటున్నారే తప్ప పనులు చేయించిన పాపాన పోలేదు. పాలకుల నిర్లక్ష్యం...అధికారుల పరిహాసం ప్రజల పాలిట శాపంగా మారింది. మిగ్‌జాం తుపాను కారణంగా కురిసిన వర్షాలకు నీటి ఉధృతి పెరిగి రోడ్డు మీదకు రావడంతో రోడ్డు కొట్టుకపోయింది. పెద్దరాళ్లు రోడ్డుపై నిలిచిపోయాయి. అటుగా పంచాయతీ పాలకులు రాకపోకలు సాగిస్తున్నారే గాని స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై ఆలోచించిన పాపాన పోలేదు. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో సమీప ప్రయివేటు పాఠశాల నిర్వాహకులు వారి సొంత నిధులతో మట్టిని వేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కల్వర్లు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభివృద్ధికి, అవినీతికి మధ్య యుద్ధం: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధికి, ప్రస్తుత ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేస్తున్న అవినీతికి మధ్య యుద్ధం జరుగుతోందని, ప్రజలు అభివృద్ధికి మారుపేరైన బొజ్జల కుటుంబం వైపే నిలబడాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి పిలుపు నిచ్చారు. టిడిపి అధికారంలోకి వస్తే నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె 34వ వార్డులో పర్యటించారు. వార్డులో కనీస మౌలిక వసతులకు నోచుకోలేదని ప్రజలు ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. 2024 ఎన్నికల్లో బొజ్జల సుధీర్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టిడిపి అధికారంలోకి వస్తే గోపాలన్న పాలనను తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. విజయ్ కుమార్ నాయుడు, కంఠా రమేష్, చెంచయ్య నాయుడు, గన్నవరం హరిబాబు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి చెన్నైకి చెందిన కైలాస్ ట్రస్ట్ అధినేత రాజకుమార్ శనివారం రూ.68,800 విరాళంగా అందించారు. మరో రూ.5 వేలును గోశాలకు వితరణ చేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పాలక మండల ఛైర్మన్ అంజురు తారక శ్రీనివాసులు అందించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవారి దర్శనం చేయించారు.

ఉమ్మడి ప్రజా ప్రభుత్వం స్థాపిస్తాం..

జనసేన జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో వైసిపి ఓటమి ఖాయమనీ, జనసేన–టిడిపి ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపిస్తామని జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను తెలంగాణలో పోటీ చేసిన బర్రెలక్కతో పోల్చి వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు ఆలోచించవలసింది జనసేన తెలంగాణ ఎన్నికల ఫలితాల గురించి కాదనీ, మిచౌంగ్ తుపాను వల్ల నష్ట పోయిన రైతుల గురించి అని చురక లంటిం చారు. జగనన్న వదిలిన బాణం అంటూ 3 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన షర్మిల కాంగ్రెస్ గూటికి చేరిందనీ, వైసీపీ తెలంగాణ నుంచి పారి పోయిందని విమర్శించారు. తెలంగాణ ఎన్నికల్లో తాము ఓడిపోయినా ముందుకెళతామన్నారు. అవినీతిపై గెలిచే వరకు యుద్ధం ఆగదని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి మురళీధర్ తెలిపారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని కోర్టు భవన ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ లో కక్షిదారులు పాల్గొని పలు కేసులు పరిష్క రించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో న్యాయమూర్తి మురళీధర్ మాట్లా డుతూ లోక్ అదాలత్ లో కేసులు పరిష్క రించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవు తుందన్నారు. కక్షలు, కార్ప ణ్యాలకు పోకుండా కేసులు పరిష్కరించుకోవాలని సూచిం చారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో న్యాయ వాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రూ. పది లక్షలతో సిసి రోడ్లు ఏర్పాట్లు

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డు బుగ్గలమిట్టలో సిసి రోడ్ల పనులను ఆ వార్డ్ కౌన్సిలర్ ఆరి శంకరయ్య శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం 50 లక్షలు ప్రకటించడం హర్షనీయమని, ఇందిరమ్మ కాలనీ బుగ్గలు మెట్లో పది లక్షలతో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టామని తెలిపారు. వర్ష బాధితులకు సాయం త్వరలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సాయంలో తేడాలు వస్తే చర్యలు: ఎమ్మెల్యే

నిత్యావసర సరుకులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వరద బాధితులకు అందించే బియ్యం, సరకుల కొలతల్లో తేడా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్చ ఆంధ్ర ఛైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ అధికారులను హెచ్చ రించారు. తుపాను ముం పు ప్రాంతాల ప్రజ లకు ప్రభుత్వం అండగా నిలిచిందని, ప్రతి కుటుం బానికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, నూ నె, ఉల్లిపాయలు, ఉర్లగడ్డలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఈ క్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని మూడో సచివాలయం పరిధిలోని సనత్ నగర్ ప్రాంతంలో బాధితులకు శనివారం ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛఆంధ్ర ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ చేతుల మీదుగా బియ్యం, సరకులు అందించారు. పంపిణీకి ముందు ఎమ్మెల్యే బియ్యం, కందిపప్పు తూకాలు వేయిం చారు. బియ్యంలో మూడు కిలోలు, కందిపప్పులో 250గ్రాముల తక్కువ ఉండడాన్ని గుర్తించారు. దీంతో వరప్రసాద్ రావు, దేవసేనమ్మలు సిబ్బం దిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయం అందిం చడంలో ఇదేమిటని ప్రశ్నించారు. వారు అసహ నం వ్యక్తం చేశారు. సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది అందరూ హాజరు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇక ముందు అలా జరగకూడదని దేవసేనమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, అజీజ్ ఖాన్,అహ్మద్ బాషా, ఆల్తాఫ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాల్టీ రూరల్ మండల పరిధిలో సుమారు 234 మంది తుపాన్ బాధితుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులను మంత్రి ఆర్‌కె రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి శనివారం పంపిణీ చేశారు.

పుత్తూరులో

నగరి నియాజకవర్గం లోని పుత్తూరు మునిసిపాల్టీ, రూరల్ మండల పరిధిలో తుపాన్ వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమై పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పుత్తూరు మున్సిపాల్టీ రూరల్ మండల పరిధిలో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఒక లీటర్ నూనె, ఒక కిలో కందిపప్పు వంతున 234 తుపాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందిం చారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సి పాల్టీ ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్లు డి జయప్రకాష్, డి శంకర్, మండల తహశీల్దారు పరమేశ్వర స్వామి, డిప్యూటీ తహశీల్దార్ విజయభాస్కర్, రూరల్ మండల అధ్యక్షులు మునివేలమ్మ, వైసిపి మునుస్వామి రెడ్డి, మండల రెవెన్యూ అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం పరిధి లోని బంగళా పంచాయతీ నల్లప్ప నాయుడు కండ్రిగ ఎస్టి కాలనీకి చెందిన వరద బాధిత 16 నిరుపేద కుటుం బాలకు పుత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు డి సుగిత 10 కేజీల బియ్యం, దుప్పట్లు, చీరలు శనివారం పంపిణీ చేశారు. విద్యతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో పిచ్చాటూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటముని, బంగళా సర్పంచ్ అయ్యప్ప పాల్గొన్నారు.

పిచ్చాటూరులో

రేణిగుంట: రేణిగుంట మండలం కొత్తపాలెం ఎస్టీ కాలనీ తుపాన్ బాధితులకు అమెజాన్, డొనేట్‌కార్ట్ సౌజన్యంతో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం బియ్యం పది రకాల నిత్యావసర సరుకులు, దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు మాట్లాడుతూ డొనేట్‌కార్ట్ ద్వారా అమెజాన్ వారు తుపాన్ బాధితులకు సహాయం చేయటం హర్షించదగ్గ విషయమన్నారు. ఆషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా వుందన్నారు. రేణిగుంట మండలం పరిధిలో మొత్తం ఐదు గ్రామాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ నగేషం మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు పేదలకు సహాయం చేయటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నగేషం,మండల కోఆప్షన్ నెంబర్ అసన్ సాహెబ్,గంగయ్య,రాజేంద్ర,తులసి రాజన్,ఆషా సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, శ్రీనివాసులు, వాలంటీర్ కిరణ్ పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్ : డక్కిలి మండలంలోని నర్సం నాయుడు పల్లిలో తుపాను బాధిత ప్రాంతాల్లో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ శనివారం పర్యటించారు. వర్షాలకు ఆ గ్రామ చెరువు తెగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న వారిని స్వయంగా పరిశీలించారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులను అందించారు. తుపాను వల్ల నష్టపోయిన వారికి త్వరలో ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. మీ మండల అధికారులు గ్రామ సచివాలయ అధికారులు మీరున్న నివాస స్థలాలకి వచ్చి నష్టాన్ని పరిశీలిస్తారని రైతులు వారికి నష్ట వివరాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గోను రాజశేఖర్, డక్కిలి తహశీల్దార్ వైసిపి , నాయకులు పాల్గొన్నారు.

కోట ఆసుపత్రి పరిశీలన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తిరుపతి జిల్లా డీ సీ హెచ్ ఎస్ డాక్టర్ ఆనందమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ లతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా బ్లడ్ స్టోరేజ్,ఆపరేషన్,ఆసుపత్రి అభివృద్ధి విధానం, కొత్త నిర్మాణ భవనాల తీరు,తదితర గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూప ఆధ్వర్యంలో పలువురు డాక్టర్ లతో కలిసి పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపెర్నడెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ రూప,పలువురు డాక్టర్ లు డోమ్ ప్రియా రావు,పృధ్వి రాజ్,రమేష్ చంద్ర, మునిశేఖర్ రెడ్డి,ఆరోగ్యమిత్ర రవి, తదితర వైద్య సిబ్బంది ఉన్నారు.

శ్రీకాళహస్తిలో 11 వేల దొంగ ఓట్లు: బొజ్జల సుధీర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో అడ్డదారుల్లోనైనా గెలవాలనే వంకర బుద్ధితో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దొంగ ఓట్ల అంకానికి తెర లేపాడననీ, ఆయనకు బిఎల్వోలు సహకరిస్తున్నారంటూ ఆరోపిం చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లో జరుగుతున్న ఓటర్ల జాబితా మార్పులు చేర్పుల అంశంపై శనివారం ఆయన స్థానిక ఎన్టీఆర్ భవన్లో మీడియాతో మాట్లాడారు. కనీసం చనిపోయిన వారి పేర్లను కూడా బిఎల్వోలు తొలగించ లేదని సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చనిపోయి ఏడాది పూర్తవుతున్నా కూడా ఇంకా ఆయన పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించ లేదంటే వారి నిర్లక్ష్యం ఎంతుందో అర్థమవుతోందన్నారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించేస్తూ, వైసిపి సానుభూతిపరుల ఓట్లను అదనంగా జతచేస్తూ ఎమ్మెల్యే ఎన్నికల్లో దొడ్డిదారిన గెలవాలని చూస్తున్నాడని విమర్శించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లో జరుగుతున్న దొంగ ఓట్ల బాగోతాన్ని కలెక్టర్ కు నివేదిస్తున్నట్లు స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో లాలు ప్రసాద్ యాదవ్

ప్రజాశక్తి -తిరుమల: రాష్ట్రీయ జనతా దళ్ ఆధ్యక్షుడు మాజీ బీహార్ ముఖ్యమంత్రి యాదవ్ తిరుమల శ్రీవారిని శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం స్వామివారి సుప్రభాత సేవలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ::GUDUR
I.P. No. 26 / 2023

Kotha Sweetha ..... Petitioner
Vs
Vallam Deepa Rani and 7 Others ...Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు తనకు ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో I.P.No.26/2023 మీ రెస్పాండెంట్లకు వగైరాలపై ఐ.పి దాఖలు చేసియున్నారు. సదరు ఐ.పిలో రెస్పాండెంట్లకు నెం. 1 నుంచి 8 నోటీసు నిమిత్తం ఇతరులకు తేది. 29-12-2023 వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గం||లకు మీరు ఎవరు అయినా స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల పై కేసు మీ మీద కోర్టు వారు పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు,
కె. హరిప్రసాద్, బి.ఎ., బి.యల్.,
విఘ్నేశ్వరపురం 8/197,
గూడూరు 524101, తిరుపతి జిల్లా,
పిటిషనరు తరపు న్యాయవాది
సెల్ నెం : 9705054118, 7010152533.